క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉద్యోగ మేళా

కల్వకుర్తి: పట్టణంలోని వాసవి నగర్‌లోని హెచ్‌బీఐటీఐ కళాశాలలో నిరుద్యోగ ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రాఘవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని వరుణ్ మోటార్స్, రేడియంట్ ఎలక్ట్రానిక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మేళాకు ఐటీఐలోని ఏ ట్రేడ్ విద్యార్థులైనా మేళాకు హాజరు కావచ్చని సూచించారు. మేళాకు వచ్చే విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటుగా, జిరాక్స్ పత్రాలను తీసుకురావాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9701200819, 9885146244 నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



తాడూరు: మండలంలోని తుమ్మలసూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయుల వేషధారణతో ఆకట్టుకున్నారు. డీఈఓగా, హెచ్‌ఎంగా, 10 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు సుజీవన్ రెడ్డి, రాజేందర్‌రెడ్డిలు అభినందించారు.

ఎస్‌ఐకి సన్మానం

చారకొండ: మండల నూతన ఎస్‌ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్. రాజశేఖర్‌ను మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రసిడెంట్ గణేష్, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు శివ, నాయకులు నాగేంద్ర, శివ, మహేష్, విజయ్, తిరుమల్లేష్, నాగేష్ గౌడ్, శ్రీను, రమణ తదితరులు ఉన్నారు.

మంత్రికి వినతి

కొల్లాపూర్: మండలం ఎన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన ఉప్పరి పోతులపల్లి వెంకటస్వామి కోడేరు పశువైద్యశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన అటెండర్‌గా పనిచేస్తున్నారు. 32 ఏళ్లుగా పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న తనను పర్మినెంట్ చేయాలని కోరుతూ ఆయన మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి



పెద్దకొత్తపల్లి: గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులలో సిబ్బంది కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ మంజుల అన్నారు. చిన్నకార్పాములలో ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న కూలీలందరికి పనులు కల్పించే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రస్తుతం ఫీడర్ ఛానల్, ఊటకుంటల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాలలో రైతులు పొలాలో కుంటల నిర్మాణాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీఏ మణిరాం, ఫీల్డ్ అసిస్టెంట్ రాంచందర్ పాల్గొన్నారు.

రెండు ఇసుక టిప్పర్ల పట్టివేత

నాగర్‌కర్నూల్ క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్న ఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రెండు టిప్పర్లలో తరలిస్తుండగా జిల్లా కేంద్రంలో పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ 2024 క్యాలెండర్‌ను మంగళవారం ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నర్సింహ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆనంద్‌జీ, గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ళ శంకరయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఎం శ్రీనివాసులు, చిన్నపాగ శ్రీనివాసులు, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

సీఐగా కనకయ్య

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రానికి సీఐగా కనకయ్యను కేటాయిస్తు ఐజీ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ సీఐగా పనిచేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి వెల్దండకు బదిలీ అయ్యారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



నివాళి అర్పిస్తున్న డీఈఓ గోవిందరాజులు

కందనూలు: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వ్యాయామ విద్యకు వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిరోజూ తప్పనిసరిగా కాల నిర్ణయ పట్టికలో చోటు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులతో పాఠశాల క్రీడలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ గోవిందరాజులు మాట్లాడారు. పాఠశాలల్లో చదవాలంటే కేవలం పుస్తకాలతో కుస్తీ పడటం కాదని, క్రీడలు అవసరమన్నారు. ఆటలు ఆడటంతో సహనం, చురుకుదనం, ఏకాగ్రత, పోరాట పటిమ, క్రమశిక్షణ, కొత్తగా ఆలోచించడం వంటి లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన పాఠశాల క్రీడల్లో విద్యార్థులు ఉత్తమ క్రీడా ప్రతిభను చూపేలా పనిచేసిన జిల్లా పాఠశాల క్రీడల సెక్రెటరీ పాండును, వ్యాయామ ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పనితీరును ఆయన అభినందించారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల మృతిచెందిన మాజీ ఎస్జీఎఫ్ సెక్రెటరీ దుర్గంప్రసాద్ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సీతారాం నాయక్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నిరంజన్ యాదవ్, సామ రమేష్, వెంకటయ్య, పురంచంద్ లక్ష్మణ్, నరేందర్ నాయక్ వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరప పంట పరిశీలన



మిరపతోటలు పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చారకొండ: మండలంలోని శాంతిగూడెంలో మిర్చిపంటలను అమెరికన్ కేరళకు చెందిన వికెండ్ కంపెనీ శాస్త్రవేత్తలు మంగళవారం ఇర్విన్ మణికంఠ ట్రేడర్స్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఇక్కడి మిర్చికి మంచి డిమాండ్ ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి నాణ్యమైన మిరప పంటను పండిస్తున్న రైతులను అభినందించారు. కార్యక్రమంలో మణికంఠం ట్రేడర్స్ గుప్తా, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

కల్వకుర్తిరూరల్: హైదరాబాద్‌లోని తెలంగాణ భవనంలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశానికి మండల కేంద్రం నుంచి తరలివెళ్లారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏర్పాటు చేసిన సమావేశంలో కల్వకుర్తి మండల అధ్యక్షుడు విజయ్‌గౌడ్, చెన్నకేశవులు, లాలూయాదవ్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల సమస్యలపై వినతి



కల్వకుర్తి: పట్టణంలోని స్టేడియంలో నిర్వహిస్తున్న బీసీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే నారాయణరెడ్డికి ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు విన్నవించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలోని ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ కలిశారు. విద్యార్థుల సంఖ్యకు తగినట్టుగా వసతులను పెంచేలా చొరవ తీసుకోవాలని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యేను కోరారు.

విద్యార్థుల సృజనాత్మకత వెలుగులోకి..



ఫుడ్‌ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

కందనూలు: ఫుడ్ ఫెస్టివల్ ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుందని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వంటకాలను, వాటి ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వంటల తయారీ ద్వారా వ్యాపార దృక్పథం ఏర్పడటంతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకత వెలుగులోకి వస్తుందన్నారు. కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు వాటిపై చర్చిస్తానని, తన తండ్రి బాటలోనే తాను వెళ్తున్నానని, డిగ్రీ కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కలెక్టర్‌తో మాట్లాడి, నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 50 స్టాల్స్‌లో 100 రకాల ఆహార పదార్థాలు ఉంచారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్ల ఈశ్వర్ రెడ్డి, కౌన్సిలర్ జక్కా రాజ్‌కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ శర్మతో పాటు అధ్యాపకులు సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సారా అమ్మితే చర్యలు



అచ్చంపేట రూరల్: నిషేధిత సారా అమ్మినా, తయారు చేసినా చర్యలు తప్పవని అచ్చంపేట ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని దర్శన్‌గడ్డ ప్రాంతంలో ఎక్సైజ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. బైక్‌పై ఓ వ్యక్తి 20 లీటర్ల సారాను తరలిస్తుండగా పట్టుకున్నారు. బైక్, సారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బాలరాజు, సిబ్బంది నవీన్, బంతిలాల్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌తండాలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయ పంట పొలాలో నిల్వ ఉంచిన 600 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. డ్రమ్ములను ధ్వంసం చేశారు. దాడుల్లో నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ అరుణ, కల్వకుర్తి ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేకాధికారులకు ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు ముందు ప్రణాళికతో వెళ్లాలన్నారు. సమస్యలు ఉన్న చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. విధుల పట్ల అలసత్వం వహించొద్దని హెచ్చరించారు. గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానకిఇ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, జెడ్పీటీసీలు మంత్రియానాయక్, ప్రతాప్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రపతిని కలిసిన గుంతకోడూరు వాసి



రాష్ట్రపతిని కలిసిన నాయకులతో రాజునేత

తాడూరు: భారత రాష్ట్రపతి ద్రౌపతిముర్మును మండలంలోని గుంతకోడూరుకి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రాజునేత కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలో అత్యున్నత పదవిలో ఉన్న ద్రౌపది ముర్మును కలవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. మర్యాదపూర్వకంగా కలవడం జీవితంలో మరిచిపోలేని గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. జీవితంలో ఎన్నో సంఘటనలు ఎదుర్కొని దేశంలోనే అత్యున్నత పదవి రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రపతితో ముఖాముఖి సమావేశంలో యువత దేశానికి వెన్నముఖ అని, దేశ రాజకీయంలో యువత క్రియాశీల పాత్ర పోషించాలని ఆమె తెలియజేసినట్లు వివరించారు. దాదాపు 15 మందిలో నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుంతకోడూరుకి చెందిన తాను ఉండడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

ఉచిత విద్యుత్ కోసం వివరాలు సేకరణ

కల్వకుర్తి: ఆరు గ్యారంటీలలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కోసం ప్రభుత్వం ఆదేశాలు అందాయని దీని కోసం విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరిస్తున్నామని ఏఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని వినియోగదారుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఆధార్, రేషన్ కార్డు, ఫోన్ నంబర్లను నమోదు చేసుకున్నారు.

వెల్దండ: ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్లు విద్యుత్ ఉచిత విద్యుత్ కోసం వినియోగదారులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఫోన్‌నెంబర్ లింక్ చేయించుకోవాలని ఏఈ సూర్యంనాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15వ తేదీలోగా వినియోగదారులందరు లింక్ చేసుకోవాలన్నారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోడేరు: మండల కేంద్రంలోని ఊరగుట్ట సమీపంలో సావిత్రిబాయి, జ్యోతిరావుపూలే విగ్రహాల ఏర్పాటుకు మంగళవారం మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 11న జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా విగ్రహావిష్కరణ చేస్తామన్నారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన వారిని గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులను అభినందించారు. విగ్రహ దాతలు దూరెడ్డి రవీందర్‌రెడ్డి, పుట్ట రాములను అభినందించారు. మండల కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖరీం, మిద్దె శాంతయ్య, కిరణ్, పాండేళ్ల సురేష్, శరత్‌బాబు, ఇమ్రాన్, బాబు, మాసుం, మిద్దె నాగేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసం నోటీస్



కొల్లాపూర్: ఎంపీపీ బోజ్యానాయక్‌పై బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించారు. ఈ మేరకు వారు ఆర్డీఓ నాగరాజుకు మంగళవారం నోటీసు అందజేశారు. మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందింది. మహిళకు రిజర్వుడు స్థానం కావడంతో ఎంపీపీగా సింగోటం ఎంపీటీసీ సభ్యురాలు గాదెల సుధారాణి, వైస్ ఎంపీపీగా మొలచింతలపల్లి ఎంపీటీసీ భోజ్యానాయక్‌ను ఎన్నుకున్నారు. ఏడాదిన్నర కాలం తర్వాత వ్యక్తిగత కారణాల వల్ల ఎంపీపీ గాదెల సుధారాణి తన పదవితో పాటు, ఎంపీటీసీ స్థానానికి కూడా రాజీనామా చేశారు. అప్పటి నుంచి వైస్ ఎంపీపీ అయిన భోజ్యానాయకే ఇన్‌చార్జ్ ఎంపీపీగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బోజ్యానాయక్ కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ఆయనను పదవి నుంచి దించేందుకు బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు యత్నిస్తున్నారు. మహిళకు రిజర్వు అయిన ఎంపీపీ పదవికి ఎన్నిక నిర్వహించాలని, వైస్ ఎంపీపీ అయిన బోజ్యానాయక్‌పై అవిశ్వాసానికి ఓటింగ్ పెట్టాలని ఎంపీటీసీలు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు శంకర్‌నాయక్, మంజుల, పాండునాయక్, దేవేంద్రమ్మ, రజిత, వరలక్ష్మీ తదితరులున్నారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకిద్దాం



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆంజనేయులు

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్రం ప్రభుత్వం అవలంభిస్తున్న మతోన్మాద, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దామని కేవీపీఎస్ జిల్లా నాయకుడు అంతటి కాశన్న పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఈ నెల 16న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమలో కాకునూరు మధు, సుధాకర్,రాముడు, యాదయ్య, చంద్రయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు వ్యతిరేకించాలని ఏఐఆర్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి పొదిల రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 16న సమ్మెతో పాటు గ్రామీణ భారత్‌బంద్ పాటించాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మండల స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, శివరాములు, మాసమ్మ, మల్లయ్య, ప్రసన్నకుమార్, జాహెద, నిర్మల పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటునట్లు గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసును సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అందజేశారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. చంద్రకళ, పుష్ప, ప్రశాంతి, గోరటి కాశన్న, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీటీఓ, అధికారులు

కల్వకుర్తి టౌన్: రోడ్డు భద్రతపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని జిల్లా రవాణా అధికారి ఎర్రిస్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో 37వ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ తాగి వాహనాలు నడిపడం చట్ట విరుద్ధమన్నారు. అనంతరం విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే విద్యార్థులకు రోడ్డు భద్రతపై శాఖ తరపున ముద్రించిన పుస్తకాలను ఆవిష్కరించి, వారికి అందించారు. అదేవిధంగా కళాశాల ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. శార్వాణి, కల్వకుర్తి ఎంవీఐ రాంబాబు, రవాణాశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థలం పరిశీలన

పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో కార్యక్రమానికి విచ్చేసిన డీటీఓ ఎర్రిస్వామి 99వ సర్వేనంబర్‌లో రవాణాశాఖకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. రవాణాశాఖ స్థలంలో కొందరు ఆక్రమించి కట్టారని, వారందరిని తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదిక పంపించి కార్యాలయంతో పాటుగా, డ్రైవింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసే విధంగా కృషిచేస్తానని ఆయన తెలిపారు.

పంచాయతీ కార్మికులకు దుస్తులు అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్ర గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయతి ఆశాదీప్ రెడ్డి దుస్తులు అందజేశారు. కరోనా కష్టకాలంలో కార్మికులు అందించిన సేవలు వెలకట్టలేనివని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

తాడూరు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ పీయూ జిల్లా అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఇంద్రకల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధను కనబరిచి విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిమ్ ఏర్పాటు

దోమలపెంట: కటకం రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దోమలపెంటలో మంగళవారం జిమ్, వాలీబాల్ కోర్టు, క్రికెట్ నెట్ ప్రాక్టీసింగ్ కోర్టులను రాములమ్మ కుమారుడు కె.వెంకటేష్ ఏర్పాటు చేశారు. తన తల్లి జ్ఞాపకార్థం స్వంత గ్రామంలో యువకుల సంక్షేమార్థం సౌకర్యాలను ఏర్పాటు చేశానని ఆయన పేర్కొన్నారు. రిక్రియేషన్ క్లబ్‌కు మరమ్మతు చేపట్టారు. అనంతరం వెంకటేష్‌ను గ్రామస్తులు సన్మానించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఉప్పునుంతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మంగళవారం ఏఆర్‌ఐ రాజేశ్వర్ రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, రేణయ్య, కృష్ణ, శేఖర్‌యాదవ్, నందాచారి, ప్రశాంత్‌రెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన ఏఎంఓ

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి, ఇంద్రకల్, సిర్సవాడ ఉన్నత పాఠశాలలను ఏఎంఓ షర్ఫుద్దీన్ మంగళవారం ఆకస్మికంగా పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలతో పాటు పాఠ్యాంశాల బోధన, వివిధ అంశాలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో మండల కేంద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండలంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన మేఘన, అరవింద్, దినేష్, చంద్రశేఖర్‌లు పుంసే విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. మరో 4 విద్యార్థులు రజతం, ఇద్దరు విద్యార్థులు కాంస్యం బహుమతులు పొందారు. కస్తూర్బా బాలికల పాఠశాల నుండి 11 మంది గోల్డ్ మెడల్ సాధించగా, రజతం 14 మంది, కాంస్యం 12 మంది విద్యార్థులు సాధించి సత్తా చాటారు.

సింగిల్‌విండోలో ఓటు నమోదు చేసుకోవాలి

చారకొండ: మండలంలోని సింగిల్ విండో సొసైటీ(పీఏసీఎస్) పరిధిలోని రైతులు ఓటు నమోదు చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షుడు జెల్ల గుర్వయ్య గౌడ్, సీఈఓ వెంకటయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యత్వం లేని పాత, కొత్త రైతులు కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు రెండు ఫొటోలు, రూ.350 చెల్లించి సభ్యత్వం పొందవచ్చని పేర్కొన్నారు.

ప్రజా అవసరాల మేరకే పాలన



పెద్దకొత్తపల్లి: ప్రజా అవసరాల మేరకే ప్రజా పాలన కొనసాగుతోందని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండలంలోని కల్వకోల్‌లో ఉన్న 17వ నంబర్ రేషన్ దుకాణాన్ని కొత్తగేరిలో ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం రేషన్‌దుకాణాన్ని మార్చామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టిరోడ్డు పనులు ప్రారంభం

చారకొండ: మండలంలోని గోకారం నుండి ఎర్రవల్లి తండావరకు మట్టి రోడ్డు నిర్మాణానికి గత సంవత్సరం ఏసీడీపీ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరయ్యారు. దీంతో మంగళవారం ఎర్రవల్లి మాజీ సర్పంచ్ సాయికుమార్ మట్టి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గోకారం నుంచి తండావరకు మట్టిపోసి చదును చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు సంజీవ్, నాయకులు రాంపాల్ తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ దిష్టిబొమ్మ దహనం



ఉప్పునుంతలలో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

సాక్షి, నెట్‌వర్క్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ దిష్టిబొమ్మను మంగళవారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. కల్వకుర్తి, ఉప్పునుంతల, చారకొండ మండల కేంద్రాల్లో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. లింగాల, వంగూరు, అమ్రాబాద్ మండల కేంద్రాల్లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే దిష్టిబొమ్మలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కొల్లాపూర్‌లో బాల్కసుమన్ చిత్రపటాన్ని దహనం చేసి ఆయన వ్యాఖ్యలను ఖండించారు. పెంట్లవెల్లిలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కల్వకుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు జగన్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అచ్చంపేటలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి మాజీ సీఎం కేసీఆర్, బాల్కసుమన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ క్షమాపణ చెప్పాలని టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య ఓ ప్రకటనలో కోరారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యాల చెన్నయ్య మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.